సాక్షి మంచిర్యాల

శనివారం । 25 । మే । 2024



లాంగ్‌ట్రిప్.. లైవ్ డ్రాయింగ్

చెన్నూర్‌కు చెందిన కళాకారుడు కశ్మీర్ టు కన్యాకుమారి చేపట్టిన లైవ్ డ్రాయింగ్ యాత్ర వచ్చే నెలలో ముగియనుంది. యాత్రలో 13వేలకు పైగా చిత్రాలు గీశాడు. 8లో▸

27న పీఎఫ్ ఫిర్యాదుల పరిష్కార వేదిక

మంచిర్యాలటౌన్: ఈ నెల 27న పీఎఫ్ ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పీఎఫ్ సభ్యులు, కార్మిక సంఘాలు, యజమానుల ఫిర్యాదులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సూచనలు తెలుసుకునేందుకు ఔట్‌రీచ్ ప్రోగ్రాంకు హాజరు కావాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
41.0 /30.0

వాతావరణం

ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

సన్నధాన్యానికే సిరి

- ఇటు బోనస్.. అటు మార్కెట్లో డిమాండ్
- ఖరీఫ్ సీజన్‌లో పెరగనున్న సాగు విస్తీర్ణం
- వర్షాలు అనుకూలిస్తే దిగుబడి.. లేదంటే నష్టం



సన్నరకం వరి సాగు (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కంటే అదనంగా రూ.500 బోనస్ ప్రకటించడం, బహిరంగ మార్కెట్లోనూ డిమాండ్ ఉండడంతో రైతాంగం సన్నరకం వరి సాగుకే మొగ్గు చూపుతోంది. ఖరీఫ్ సీజన్‌లో 80శాతం సన్నరకం వరి పంట సాగవుతుండగా.. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. వానకాలంలో భారీ వర్షాలు కురిస్తే జలాశయాలు నిండుతాయి. గత కొంతకాలంగా ఆలస్యంగా కురుస్తున్న వర్షాల వల్ల ఆగస్టు నెలలో నాట్లు వేసుకుంటుండడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. రుతుపవనాల రాకతో సమృద్ధిగా వర్షాలు కురిస్తే సన్న రకం వరి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చేందుకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. రాష్ట్ర అవసరాలకు సరిపడా సన్నబియ్యం కోసం స్థానిక రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఈ నిర్ణయం తీసుకుంది. తెల్ల రేషన్‌కార్డుదారులతోపాటు హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. డిమాండ్ తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు స్థానిక రైతులను ప్రోత్సహించి సన్నరకం వరి సాగు పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే సన్న రకం సాగు చేసే రైతులకు బోనస్ ప్రకటించింది. గత ఏడాది మార్కెట్‌లో సన్న రకం వడ్లు క్వింటాల్‌కు రూ.2,800 నుంచి రూ.3,200 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2203తో కొనుగోలు చేస్తున్నారు. వచ్చే నెలలో పంట ఉత్పత్తులకు ప్రభుత్వ మద్దతు ధర నిర్ణయించే అవకాశం ఉంది. మద్దతు ధరతోపాటు బోనస్ లభించడం, వ్యాపారులు సైతం సన్నరకం వడ్ల కొనుగోలుకే మొగ్గు చూపుతుండడంతో విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

1.60లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో సన్నరకం 90శాతం ఉండే అవకాశం ఉంది. 3.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. వాతావరణ పరిస్థితులు, చీడపీడల వ్యాప్తిని బట్టి దిగుబడిపై ప్రభావం పడుతుంది. సన్నరకం దీర్ఘకాలిక పంట కావడం, నీటితడులు ఎక్కువగా అవసరం కావడంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, కాలువల కింద రైతులు సాగు చేస్తున్నారు. పూర్తి వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు కొంతవరకు దొడ్డరకం స్వల్పకాలిక రకాలు ఎంచుకుంటున్నారు. సన్నరకం రైతుల అవసరాలకు పోను మిగతా ధాన్యం వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. గతేడాది సన్నరకానికి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పోటీ పడి రూ.3 వేలకు అటు ఇటుగా చెల్లించి కొనుగోలు చేశారు. రైతుల పొలం వద్దకు వచ్చి తూకం వేసుకున్నారు. యాసంగి 90 శాతం రైతులు స్వల్పకాలిక దొడ్డురకం వరి సాగు చేస్తున్నారు. నీటితడులు తక్కువగా, దిగుబడి త్వరగా వస్తుందని, వేసవి వాతావరణ ప్రభావం తట్టుకుని దిగుబడి వస్తుందని మొగ్గు చూపుతున్నారు.

అన్నీ ఎక్కువే..

దొడ్డురకం వరి పంట దిగుబడితో పోల్చుకుంటే సన్నరకం పంటకు నీటితడులు, ఎరువులు, దిగుబడి సమయం, చీడపీడల వ్యాప్తి, పెట్టుబడి ఎక్కువగానే ఉంటుంది. మరోవైపు ధాన్యం దిగుబడి తక్కువగానే వస్తుంది. సాధారణంగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడులు తక్కువే. దొడ్డు రకాలు ఎకరానికి 40 నుంచి 50 బస్తాలు వస్తే.. అదే సన్న రకాలైతే సగటున 30 నుంచి 35 బస్తాలు, మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు తక్కువ దిగుబడి వస్తుంది. ఇది కూడా నీటితడుల లభ్యత, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే. ధరతో పోలిస్తే సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1000 అధికంగా లభిస్తుంది. యాసంగిలో దొడ్డు రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దొడ్డు ధాన్యం కామన్ రకం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2183 ధర చెల్లిస్తున్నారు. అదే సన్నరకం ధాన్యం వ్యాపారులకు రూ.2600 నుంచి రూ.2700 వరకు ధరతో విక్రయిస్తున్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి



సన్నరకానికే కాకుండా దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలి. వర్షాలపై ఆధారపడి సాగు చేసుకుంటున్నాం. వర్షం పడితే పంట ఎల్లినట్లు లేకుంటే లేదు. ఒక ఏడాది వర్షాలు ఉంటే మరో ఏడాది వర్షాలు పడుతలేవు. ఎప్పుడు వర్షాలు ఉంటాయో ఎప్పుడు ఉండవో తెలుస్తలేవు. చెరువులు లేవు, వాగు లేదు, బోరు లేదు వర్షం మీద ఆధారపడి దొడ్డు రకం వడ్ల సాగు చేసుకుందామని అనుకుంటున్నా. దొడ్డ వడ్లకు బోనస్ ఇవ్వాలి.

– జి.నరేష్, నెన్నెల

న్యూస్‌రీల్

అర్హులకు ప్రభుత్వ పథకాల ఫలాలు

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తోందని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, రీజనల్ మాస్టర్ ప్రభాకర్‌స్వామితో కలిసి అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు జిల్లాలోని బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి, జన్నారం మండలం తిమ్మాపూర్, తాండూర్ మండల మాదారం, లక్సెట్టిపేట మండలం గుల్లకోట, హాజీపూర్ మండలం దొనబండ గ్రామాల్లో ప్రజల స్థితిగతులు, ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం అసిస్టెంట్ సెక్షన్ అధికారులు పరిశోధించారని తెలిపారు. పల్లెప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల ద్వారా మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మొక్కలు నాటేందుకు జిల్లాలో కేటాయించిన లక్ష్యాలను నర్సరీల ద్వారా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు మరింత చురుగ్గా ఉండేందుకు ప్లేస్కూల్ తరహాలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని కేంద్ర బృందం సభ్యులు తెలుపగా.. చర్యలు తీసుకుంటామని అన్నారు.

సివిల్ సప్లయి మేనేజర్ నిలదీత



మేనేజర్ గోపాల్‌ను నిలదీస్తున్న రైతులు

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో ఉన్న పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ఈ విషయంలో అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని శుక్రవారం గ్రామానికి వెళ్లిన పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌ను రైతులు నిలదీశారు. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు వచ్చినా తాము పండించిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని, విధిలేని పరిస్థితుల్లో బయట అమ్ముకోవాల్సి వస్తోందని వాపోయారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. మేనేజర్ గోపాల్ మాట్లాడుతూ రైతులు ఫిర్యాదు చేసిన వివరాలను జిల్లా అదనపు కలెక్టర్‌కు వివరిస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు బుక్యా రాజ్‌కుమార్‌నాయక్ రైతులకు సంఘీభావం తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీలో ప్రవేశాల సంఖ్య పెంచాలని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఆదర్శ కమిటీ పనులు పూర్తి చేయించాలని అన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి కేరియర్ గైడెన్స్ ఇవ్వాలని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు విద్యార్థులకు అనుకున్న సమయానికి అందించాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో అత్యధిక ఫలితాలు సాధించేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో జెండర్–కో–ఆర్డినేటర్ యశోధర, కో–ఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1407మంది విద్యార్థులకు గాను 1305 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 1248 మందికి గాను 1158 మంది హాజరు కాగా 90 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ 159 మందికి గాను 147 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 642 మంది విద్యార్థులకు గాను 609 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 547 మంది విద్యార్థులకు గాను 520 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 95 మందికి గాను 88 మంది హాజరు కాగా 7 గైర్హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

కొనుగోలు కేంద్రం కాంటా సీజ్



దుగ్నెపల్లిలోని కాంటాను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలో డీసీఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ శుక్రవారం పరిశీలించారు. తూకంలో మోసంపై ఫిర్యాదు మేరకు కేంద్రాన్ని సందర్శించారు. కాంటాతో మోసానికి పాల్పడినట్లు నిర్ధారించిన అనంతరం కాంటాను సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రంజిత్‌కుమార్ ఉన్నారు.

బ్రిడ్జి పనులకు మోక్షమెప్పుడో!



వర్షాలకు కూలిపోయిన రాళ్లవాగు కాజ్‌వే(ఫైల్)

- నిర్మాణానికి మార్చి 10న శంకుస్థాపన
- ప్రతియేటా వర్షానికి కూలుతున్న కాజ్‌వే
- రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి రంగంపేట్‌కు వెళ్లే దారిలో రాళ్లవాగుపై ఉన్న కాజ్‌వే ప్రతియేటా వర్షాలకు కొట్టుకుపోతోంది. వర్షకాలం పూర్తి కాగానే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మళ్లీ వినియోగంలోకి తేవడం పరిపాటిగా మారింది. లోలెవల్‌లో నిర్మించిన వంతెన కావడంతో చిన్నపాటి వర్షాలకే వరద నీటిలో మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉండగా.. ఈ ఏడాది మార్చి 10న రూ.13.50కోట్లతో బ్రిడ్జి పనులకు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదు. ఎన్నికల కోడ్‌కు ముందే శంకుస్థాపన చేయగా.. ఆ తర్వాత పనులు చేపట్టే అవకాశం ఉన్నా విస్మరించారు. రానున్న వర్షకాలంలో మళ్లీ కాజ్‌వే వరద నీటి మునిగి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వర్షాలు ప్రారంభమైతే నాలుగు నెలలపాటు రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీనిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం కష్టమే. వచ్చే వర్షకాలం నాటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తే ప్రజలు వాగుపై నిరంతరం రాకపోకలు సాగించే వీలుంటుంది.

జిల్లా కేంద్రంగా మారినా..

మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి పట్టణం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. కాలనీలకు వెళ్లేందుకు కాజ్‌వేనే దిక్కుగా మారింది. పాతమంచిర్యాల, రంగంపేట్, పవర్‌సిటీ కాలనీలో దాదాపు నాలుగు వేలకు పైగా కుటుంబాలు నివసిస్తుండగా.. రాళ్లవాగుపై కాజ్‌వే(లోలెవల్ వంతెన) మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. పాతమంచిర్యాలకు జాతీయ రహదారి మీదుగా వెళ్తే నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుండడంతో రాళ్లవాగుపై ఉన్న కాజ్‌వేపై నుంచి రంగంపేట్, పవర్ సిటీ, పాతమంచిర్యాల ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతియేటా వర్షకాలంలో చిన్నపాటి వర్షానికే కాజ్‌వే వరద నీటిలో మునిగిపోయి వర్షాలు తగ్గే వరకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. కొద్ది రోజులపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడితే ఆయా కాలనీల ప్రజలు పాతమంచిర్యాల, గ్రీన్‌సిటీ మీదుగా వెళ్తున్నారు. కానీ ప్రతియేటా వరద ఉధృతి పెరిగి కాజ్‌వే కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ప్రతియేటా ఇదేతంతు జరుగుతుండడంతో మరమ్మతుల కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఆ డబ్బుతో ఎత్తయిన బ్రిడ్జి నిర్మాణానికి అవకాశం ఉండేది. కానీ కాజ్‌వేకు ప్రతియేటా మరమ్మతులు చేస్తూ బ్రిడ్జిని నిర్మించకుండా వదిలేస్తున్నారు.

ఏటా నిధులు వృథా

ప్రజల ఇబ్బందుల దృష్ట్యా 2005లో రూ.80 లక్షలతో కాజ్‌వే నిర్మించి రాళ్లవాగు నీరు వెళ్లేందుకు దాని కింద పైపులు వేశారు. కాజ్‌వేకు అప్రోచ్ రోడ్డు, డ్రెయినేజీలను రూ.35లక్షలతో నిర్మించారు. ఈ కాజ్‌వేను లోతట్టుగా నిర్మించడం వల్ల చిన్నపాటి వర్షానికే కాజ్‌వే వరద నీటిలో మునిగిపోయి, వరద ఉధృతికి కోతకు గురవుతోంది. ప్రతీసారి కోతకు గురైన చోట తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. గతంలో రంగంపేట, ఆండాళమ్మ కాలనీ, పాతమంచిర్యాలకు చెందిన ప్రజలకు ఈ కాజ్‌వే ఉపయోగకరంగా ఉండగా.. పట్టణ అభివృద్ధిలో ఆ ప్రాంతంలో పవర్‌సిటీ కాలనీ ఏర్పడింది. పాతమంచిర్యాల, రంగంపేట్‌లో వందలాది భవనాలు నిర్మాణంతో ఈ ప్రాంతంలో నివాసాలు పెరిగాయి. దీంతో జనసంచారం ఎక్కువైంది. బ్రెడ్ కంపెనీ, రైస్ మిల్లు ఇటువైపే ఉండడం, కొత్తగా లేఔట్లతో వెంచర్లు ఏర్పాటు చేసి, వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీలక్ష్మీనగర్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో నిత్యం రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.

టెండరు ప్రక్రియలో ఉంది



రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించి డీపీఆర్ సైతం అందించాం. ఎన్నికల కోడ్ అనంతరం టెండరు ప్రక్రియ పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఏడాదిలోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాం. వచ్చే ఏడాది వర్షాకాలం వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

– మధుకర్, మంచిర్యాల మున్సిపల్ డీఈ

ప్రశాంతంగా పాలిసెట్



సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: జిల్లాలో పాలిసెట్–2024 శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. నస్పూర్, మంచిర్యాల పట్టణాల్లోని 9 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లాలో 2016మంది విద్యార్థులకు గాను 1849మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 810 మంది బాలికలు, 1039 మంది బాలురు ఉన్నారు. ఉదయం 10గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 11గంటల నుంచి 1.30గంటల వరకు పరీక్ష జరిగింది. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు నిర్ణీత సమయానికే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలను పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ పీ.శ్రీనివాసరావు, ప్రత్యేక పరిశీలకులు డి.రాందాస్ సందర్శించారు. కాగా, పలువురు విద్యార్థుల హాల్‌టికెట్లలో పరీక్ష కేంద్రాల అడ్రస్ తప్పుల తడకగా ప్రచురితం కావడంతో ఇబ్బంది పడ్డారు. పరీక్షల నిర్వహణకు సింగరేణి శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటుచేయించారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 952 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 871 మంది హాజరుకాగా 81 మంది గైర్హాజరు అయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 543 మందికి గాను 510 మంది హాజరయ్యారు. మరో 33 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 409 మంది విద్యార్థులకు గాను 361 మంది పరీక్ష రాశారు. 48 మంది గైర్హాజరయ్యారని బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) భరతేష్ కుమార్‌జైన్ అన్నారు. శుక్రవారం అమృత్ భారత్ కింద ఎంపికైన మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న విశ్రాంతి గది, రిజర్వేషన్ కౌంటర్, పార్కింగ్ స్థలాలు సందర్శించారు. స్టేషన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ టవర్ స్థలాన్ని వేరే చోటుకు మార్చాలని, స్వాగత తోరణం, ఎలివేషన్ డిజైన్ పునరుద్ధరించాలని సూచించారు. మంచిర్యాల స్టేషన్ మేనేజర్ రవీందర్, ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

మంచిర్యాలక్రైం: పోలీస్ అధికారుల వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 50మంది డ్రైవర్లు ఉన్నారని, విధి నిర్వహణలో భాగంగా వాహనాల కండీషన్ చూసుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించడం వల్లే రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయని తెలిపారు. అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ, ఎంటీవో మధు, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహణకు వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు తగ్గుముఖం పట్టాయని, రక్తదాన శిబిరాలను నిర్వహించేలా చూడాలని రామగుండం సీపీ శ్రీనివాసులును సొసైటీ సభ్యులు కోరారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి కె.సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, ఎం.సత్యనారాయణరెడ్డి, కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.

'భారీ మెజార్టీతో బీజేపీ గెలుపు'



మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

మందమర్రిరూరల్: వచ్చే నెల 4న వెలువడే ఎంపీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని, ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో బీజేపీ నాయకుడు కోలేటి శివ ఇంటి వద్ద నాయకులను కలిసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని స్థానికేతరుడైన వివేక్ వెంకటస్వామికి పట్టం కడితే గెలిచిన ఐదు నెలల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురు చూస్తుంటే వర్షాలు పడి పంట తడిసి రైతులు నష్టపోయి దుఃఖిస్తున్నారని, ఎమ్మెల్యే వివేక్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వద్దకు వచ్చి చూసి ఓదార్చింది లేదని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయలేదని మండిపడ్డారు. బీజేపీ, అనుబంధ సంఘాలు, ఎమ్మార్పీఎస్, బీఎమ్మెస్, నేతకాని కులసంఘం, కిసాన్ వికాస్, హిందూవాహిని తదితర నాయకులు పాల్గొన్నారు.

టీకా తర్వాత పరిణామాలపై సమీక్ష



సమావేశంలో డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో వేస్తున్న టీకాల తర్వాత ఎవరికైనా వచ్చే ప్రతికూల పరిణామాలపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈఎఫ్ఐ రోగ నిరోధక ఇమ్యూనైజేషన్‌కు సంబంధించిన మూడు కేసులను సమీక్షించారు. టీకా నాణ్యతా లోపం, రోగ నిరోధక శక్తి, యాదృచ్ఛిక ప్రతిచర్య మొదలైన వాటిపై సమీక్ష చేసిన కమిటీ సభ్యులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు సూచనలు చేశారు. టీకా తర్వాత వచ్చే పరిణామాలపై తల్లులు, ఇంటి పెద్దలకు ముందస్తు అవగాహన కల్పించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని తీర్మానం చేశారు. ప్రతీ బుధ, శనివారాల్లో జరిగే టీకా కార్యక్రమాల్లో ఆరోగ్య కార్యకర్తలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో తెలిపారు. ఎంసీహెచ్ ఆర్‌ఎంవో భీష్మ, వైద్యులు శ్రీకాంత్, అలివేణి, పి.సురేందర్‌రెడ్డి, ఫయాజ్‌ఖాన్, నిత్య, కృష్ణ, మనోజ్‌కుమార్, స్పెషలిస్టు వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్లు అప్పగింత


బాధితులకు మొబైళ్లు అందజేస్తున్న ఎస్సై

వేమనపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐ ఆర్ పోర్టల్ సహాయంతో స్వాధీనం చేసుకుని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ బాధితులకు అందజేశారు. కల్మలపేటకు చెందిన కొత్తూరి మధుకర్, జాజులపేటకు చెందిన దుర్తి ప్రవీణ్ గత జనవరిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకుని నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్లీ మేరకు శుక్రవారం పోలీసులు సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు.

సాంకేతికతను గ్రామాలకు విస్తరిస్తాం


జ్యోతిని ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు

బెల్లంపల్లి: ఆధునిక వ్యవసాయ సాంకేతికతను గ్రామాలకు విస్తరింపజేస్తామని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. కేవీకే స్వర్ణోత్సవ జయంతి వేడుకలు శుక్రవారం బెల్లంపల్లిలో అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. అనంతరం కేవీకే ద్వారా లబ్ధి పొందిన రైతుల సూచనలు, సలహాలు, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణోత్సవ జయంతి జ్యోతిని రైతుల సమక్షంలో ప్రదర్శించారు. ఆదిలాబాద్ కేవీకేకు ఆ జ్యోతిని అప్పగించారు. పలువురు రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ప్రియసుగంధి, స్రవంతి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సహజీవనం చేస్తున్న ఇద్దరి ఆత్మహత్య


కోట రాజేశ్ (ఫైల్)

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఇద్దరు ఉరేసుకుని మృతిచెందిన ఘటన మండలంలో సంచలనం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వాయిపేటకు చెందిన కోట రాజేశ్ (40), నాయిని చీకటి (28) కొద్దిరోజులుగా సహజీవనం చేస్తున్నారు. వెలమపల్లి జాతీయ రహదారి పక్కన గల ఇటుకల కంపెనీలో కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దాబాలో వీరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఇటుకల కంపెనీలో పనిచేసే మిగతా కూలీలు సామగ్రి భద్రపరిచేందుకు వెళ్లి గుర్తించారు. స్థానికులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ సుధాకర్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబీకులు ఇరువురి మృతిపై అనుమానం వ్యక్తం చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమా? లేక ఇతర కారణలేమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లాంగ్ ట్రిప్.. లైవ్ డ్రాయింగ్

- దేశవ్యాప్త కళాయాత్ర చేపట్టిన ఆర్టిస్ట్
- మిత్రుల సాయంతో పోచం సాహసం
- చిత్రలేఖనం ప్రాముఖ్యత తెలిపేందుకే..
- ఎన్నో అవార్డులు, రికార్డులు సొంతం
- ముగియనున్న ఏడేళ్ల సుదీర్ఘ యాత్ర
- 7న కన్యాకుమారిలో ముగింపు సభ


లైవ్ డ్రాయింగ్ వేస్తున్న పోచం   పోచం గీసిన చిత్రం (ఇన్‌సెట్‌లో)


ముగింపు సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోచం

చెన్నూర్: దేశ వ్యాప్తంగా వివిధ కళాప్రదర్శనలతో రికార్డులు సొంతం చేసుకున్న కళాకారులున్నారు. వివిధ యాత్రలు చేపట్టి గుర్తింపు తెచ్చుకున్నవారూ ఉన్నారు. ఇదే కోవలో చెన్నూర్ మండల కేంద్రానికి చెందిన ఏల్పుల పోచం లైవ్ డ్రాయింగ్‌లో రికార్డు సాధించాలని యాత్ర చేపట్టారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర చేపట్టి రికార్డులకు ఎక్కనున్నారు. పోచం చేపట్టిన యాత్ర వచ్చే నెలలో ముగియనుంది. సామాన్య కుటుంబంలో జన్మించిన పోచం సాహసోపేత నిర్ణయం తీసుకుని దేశవ్యాప్తంగా కళాయాత్ర చేపట్టి విజయవంతంగా పూర్తి చేయనున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

లైవ్ డ్రాయింగ్ ప్రాముఖ్యత తెలిపేలా..

లైవ్ డ్రాయింగ్ ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో నిరుపేద కుటుంబానికి చెందిన మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన ఏల్పుల రాజక్క–లచ్చయ్య దంపతుల కుమారుడు పోచం అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకోనున్నారు. చిన్నప్పటి నుంచి డ్రాయింగ్‌పై మక్కువ ఉన్న పోచం డ్రాయింగ్ టీచర్ సత్యనారాయణ వద్ద ప్రాథమిక శిక్షణ పొందారు. స్నేహితుల సాయంతో చిత్రలేఖనంలో తనదైన ముద్ర వేసుకున్నారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఉన్న మక్కువ, స్నేహితులు పూసల సందీప్, పాశికంటి కుమార్ స్ఫూర్తితో హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తిచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో మాస్టర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ చదివారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల పబ్లిక్ స్కూల్‌లో రెండేళ్ల పాటు డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలోనే చిత్రలేఖనం ప్రాముఖ్యతను దేశానికి తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాల యువతకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పించేందుకు కంకణం కట్టుకున్నారు.

28 రాష్ట్రాలు.. 13 వేల చిత్రాలు..

28 రాష్ట్రాల్లో చేపట్టిన కళాయాత్రలో పోచం ఇప్పటి వరకు 13 వేలకు పైగా చిత్రాలు గీశారు. ఆయా రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలకు అద్దంపట్టేలా చిత్రాలు గీసి అక్కడి అధికారులు, ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఎవరైనా పెడితే తిన్నారు.. లేదంటే పస్తులున్నారు.. కానీ.. యాత్రను ఎక్కడా ఆపలేదు. అస్సాంలో కాఫీ తోటల అందాలు, ఉత్తరప్రదేశ్‌లో బందిపోట్ల దాడిని కూడా త ట్టుకుని యాత్రను కొనసాగించి న ఘనత పోచంకే దక్కింది.

దేశంలో యాత్ర సాగిందిలా..

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 2017లో కళాయాత్ర ప్రారంభించిన పోచం 28 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో లైవ్ డ్రాయింగ్ ప్రాముఖ్యతను వివరించారు. యాత్రలో భాగంగా స్మారక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు తిలకించారు. ఎనిమిది జ్యోతిర్లింగాలు, తొమ్మిది అష్టశక్తి పీఠాలు సందర్శించారు. 24 దేశస్థాయి యూనివర్సిటీలు, ఫైన్ ఆర్ట్స్ కళాశాలల్లో లైవ్ డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. 2,410 రోజుల యాత్ర చేపట్టి 30,700 కిలో మీటర్లు నడిచారు.

2017లో కళాయాత్రకు శ్రీకారం..

చిత్రలేఖనాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయాలని సంకల్పించారు. మదిలో పుట్టిన ఆలోచన మేరకు 2017లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్రకు శ్రీకారం చుట్టారు. పోచం చేపట్టిన ఏడేళ్ల కళాయాత్ర చివరి ఘట్టానికి చేరుకుంది. యాత్ర ప్రారంభం నుంచి నేటి వరకు పోచం ఎన్నో రికార్డులు, అవార్డులు సొంతం చేసుకున్నారు. వివిధ రాష్ట్రాలు, విభిన్న సంస్కృతులు, మతాలు, కులాలకు అతీతంగా పోచం యాత్ర సాగుతోంది. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా తన యాత్రకు ఎక్కడా ఆటంకం కలగకుండా అందరి సహకారం తీసుకుంటున్నారు. పట్టుదల ఉంటే లక్ష్య సాధన సాధ్యమని నిరూపించారు. ఆయా రాష్ట్రాల ప్రజలు, అధికారుల ఆదరణతో ఏడేళ్ల యాత్రను కొద్దిరోజుల్లో ముగించనున్నారు.

అవార్డులు, రికార్డులు..

పోచం చేపట్టిన కళాయాత్రను గుర్తించి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ప్రెస్టీజీఎస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతిష్టాత్మక అవార్డులు అందజేశాయి. ఆయా దేశాల నుంచి పోచం ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

మిత్రుల సహకారంతోనే..

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో జన్మించిన పోచం ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి నుంచి సాహసోపేతమైన కళాయాత్రకు పూనుకున్నారు. ఏ ప్రభుత్వాలు సాయం అందించకున్నా మిత్రుల సహకారంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేసి కొద్దిరోజుల్లో ముగించనున్నారు. ముగింపు సభను అతడి మిత్రులే నిర్వహిస్తున్నారు. లైవ్ డ్రాయింగ్‌లో దేశంలోని 28 రాష్ట్రాల్లో కళాయాత్ర నిర్వహించి ఎన్నో అవార్డులు, రికార్డులు సొంతం చేసుకున్న తెలంగాణ బిడ్డ పోచంకు ప్రభుత్వం ఏదైనా ఉద్యోగమిచ్చి ఆదుకుంటుందని ఆశిద్దాం.

నా జన్మ ధన్యమైంది



కళే నా ప్రాణంగా యాత్ర ప్రారంభించాను. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా ఏడేళ్లు నిరంతరం యాత్ర కొనసాగించాను. చిత్రకళ ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా తెలియజేయాలని చేపట్టిన యాత్ర కొద్దిరోజుల్లో విజయవంతం కానుంది. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా. జూన్ 7న కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌లో ముగింపు సభను నా మిత్రులు ఏర్పాటు చేశారు. ఓ కళాకారుడికి ఇంతకన్నా ఏం కావాలి. నా జన్మధన్యమైంది.

– ఏల్పుల పోచం, లైవ్ డ్రాయింగ్ కళాకారుడు, చెన్నూర్

ముదిరాజ్, గంగపుత్రుల మధ్య కుదరని సయోధ్య


ముదిరాజ్‌లతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువు వివాదం రోజురోజుకూ ముదురుతోంది. చెరువులో వాటా విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాల్సిన మత్స్యశాఖ అధికారులు విఫలమయ్యారని ముదిరాజ్ కులస్తులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ.. వాటా వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మత్స్యశాఖ శుక్రవారం గంగపుత్రులకు చెరువులో చేపలు పట్టుకునేందుకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వాటా సమస్య పరిష్కరించకుండా, సొసైటీలోని బోగస్ పేర్లు తొలగించకుండా చేపలు పట్టేందుకు ఏ విధంగా అనుమతించారని మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రామ్‌ధాన్‌ను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రవీందర్ అక్కడికి చేరుకుని ఇరు పక్షాలతో మాట్లాడారు. సొసైటీలో సభ్యుల వివరాలు ఎలా ఉన్నాయని మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రామ్‌ధాన్‌ను సీఐ అడిగి తెలుసుకున్నారు. సొసైటీలో నలుగురు ముదిరాజ్‌లకు సభ్యత్వం ఉందని, వారు చేపలు పట్టుకోవచ్చని రామ్‌ధాన్ తెలిపారు. కాగా, గతంలో ముదిరాజ్‌లు, గంగపుత్రుల మధ్య చేసుకున్న పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం చెరువులో సగం వాటా కావాలని ముదిరాజ్ కులస్తులు తేల్చిచెప్పారు. దీంతో అధికారులు శనివారం సొసైటీ సభ్యుల పేర్లతో పాటు గుర్తింపు కార్డులు తీసుకునివస్తామని తెలిపారు. చెరువు వివాదాన్ని శనివారం పరిష్కరిస్తామని వారు తెలుపగా ఇరువర్గాల వారు వెళ్లిపోయారు.

నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో ప్రతిభ


రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఒకటో ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రిటైర్డ్ కార్మికుడు రాజకొమురయ్య ప్రతిభ కనబర్చాడు. 65పైబడి వయస్సు విభాగంలో మూడు కిలోమీటర్ల వాక్‌లో రెండో బహుమతి సాధించాడు. రాజకొమురయ్యను స్థానిక సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

నకిలీ పత్తి విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం


సీజ్ చేసిన విత్తనాలు, నిందితుడితో పోలీసులు


పోలీసుల అదుపులో నిందితుడు రాజు

బెజ్జూర్: ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు మండలంలోని సోమిని గ్రామంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం. తొర్రం ప్రశాంత్ దగ్గర నకిలీ బీటీ–3 పత్తి విత్తనాలున్నాయన్న పక్కా సమాచారం కోసం విచారించగా అతడు మహారాష్ట్రలోని అహెరి వద్ద ఉన్నట్లు తెలిసింది. దీంతో అక్కడికి వెళ్లి ఆయనను విచారించగా బెజ్జూర్ మండలంలోని తన స్వగ్రామమైన సోవినిలోని తన ఇంట్లో ఉన్నట్లు తెలిపాడు. దీంతో అతడి ఇంట్లో తనిఖీలు చేపట్టగా రెండు సంచుల్లో 70 కిలోల నకిలీ బీటీ–3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.1.50లక్షల వరకు ఉంటుంది. ఎక్కడినుంచి కొనుగోలు చేశావని విచారించగా చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామంలోని చాపిలె పురుషోత్తం, సిర్పూర్ (టి) మండలంలోని భూపాలపట్నం గ్రామంలోని బొల్ల బోయిన అశోక్, అదే గ్రామానికి చెందిన బొల్ల బోయిన కృష్ణ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. విత్తనాలను సీజ్ చేయడంతో పాటు అతడిని బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అమాయక రైతులను మోసం చేసే వారిని, జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుల్ వీ మధు, పీ రమేశ్, వెంకటేశ్ ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

తాండూర్: మండలంలో పోలీసులు శుక్రవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. రామగుండం టాస్క్‌ఫోర్స్, తాండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఎర్రవోతు రాజు ఇంట్లో సోదాలు చేయగా నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. రాజు ఇంట్లో నుంచి 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా పున్నూర్ గ్రామం నుంచి వలసవచ్చి ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రోళ్లపాడు గ్రామంలో నివాసముంటున్న తిరుమల శెట్టి రామకృష్ణ నుంచి కొనుగోలు చేసినట్లు రాజు వెల్లడించినట్లు పోలీసులు ప్రకటించారు. ఈమేరకు రాజును అరెస్ట్ చేయగా, రామకృష్ణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై లక్ష్మణ్, తాండూర్ ఏఈవో పుష్పలత, పోలీసులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీపీలో దుమ్మును నివారించాలి


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో వస్తున్న దుమ్మును నివారించాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. దుమ్ము విపరీతంగా లేవడంతో శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు తెలిపారు. తరచూ వాటర్ స్ప్రే చేయించాలని కోరారు. క్యాంటీన్‌ను మరింత మెరుగుపరచాలని, ఉద్యోగుల కోసం అన్ని వసతులతో కూడిన రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ కార్మికులపై పనిభారం మోపుతున్నారని ఆరోపించారు. దీనికి కారణమైన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ నాయకుడు తిరుపతిరాజు, ఏరియా కార్యదర్శులు శ్రీలం చిన్నయ్య, కాల్వ శ్రీనివాస్, తోకల వెంకటస్వామి, మోహన్, సుధాకర్, పిట్ సెక్రటరీ బలముల జాన్సన్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జగన్ పాల్గొన్నారు.

ఐకే–ఓసీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే–ఓసీపీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్ రవికుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గత రెండు నెలల కన్వినెన్స్ వెహికిల్ అందుబాటులో లేక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సర్వే ఆఫ్ అయిన ఎక్స్‌ప్లోజివ్ వెరిల్ ఉండడంతో వెహికిల్ అందుబాటులో ఉండటం లేదని, ఎంవీ, డ్రైవర్స్, ఓవర్‌మెన్స్, ఈపీ, ఎలక్ట్రీషియన్స్, జనరల్ మజ్దూర్ల కొరత ఉందని, వెంటనే ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఈపీ ఆపరేటర్ల, సర్వేయర్స్ రూంలో మధ్యలో గత స్విచ్ఛ్ స్టేషన్‌ను వెంటనే మార్చాలని, ఈపీ ఆపరేటర్ల కొరత తీర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు నాగభూషణం, శ్రీనివాస్, మల్లికార్జున్, యాదగిరి, రవీందర్, మల్లేశ్, సీను, పోషం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో బంగారం చోరీ.. మంచిర్యాలలో అమ్మకం

- పోలీసుల అదుపులో నిందితుడు
- విచారణకు మంచిర్యాలకు చేరిన సిద్దిపేట పోలీసులు
- షాపు యజమానిని కాపాడేందుకు యూనియన్ నాయకుల యత్నం


మంచిర్యాలలో మూసి ఉన్న బంగారం దుకాణాలు

మంచిర్యాలక్రైం: సిద్దిపేట జిల్లా కేంద్రంలో మూడు నెలల క్రితం రెండు చోరీలకు పాల్పడిన నిందితుడు అక్కడి పోలీసులకు వారం క్రితం దొరికాడు. పోలీసుల విచారణలో దోచుకున్న బంగారు నగలను మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన ఓ బంగారం దుకాణం యజమానికి రూ.4లక్షలకు విక్రయించినట్లు ఒప్పుకొన్నాడు. దీంతో రంగంలోకి దిగిన సిద్దిపేట సీఐ ఉపేందర్ ఈ నెల18న నిందితుడిని తీసుకుని బంగారం కొనుగోలు చేసిన మంచిర్యాలలోని షాపునకు చేరుకున్నాడు. మూడు నెలల 15 రోజుల క్రితం నిందితుడు చోరీకి పాల్పడిన బంగారాన్ని ఇదే షాపులో విక్రయించినట్లు చెప్పి విచారణ చేపట్టినట్లు సమాచారం. సదరు వ్యాపారి తాను షాపు ప్రారంభించి రెండు నెలలే అవుతోందని, తాను బంగారం కొనలేదని మొదట తప్పించుకునే ప్రయత్నం చేయగా నిందితుడు ఆధారాలు చూపాడు. వ్యాపారి ఇంతకు ముందు వేరే దుకాణంలో పని చేస్తుండగా బంగారం అమ్మినట్లు చెప్పాడు. దీంతో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు ఈ నెల 19న రావాలని సీఐ బంగారం వ్యాపారికి చెప్పి వెళ్లి పోయాడు. కాగా, అదేరోజు రాత్రి సదరు వ్యాపారి ఆస్పత్రిలో చేరి డ్రామా ఆడినట్లు సమాచారం. నాలుగు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో బంగారం దుకాణాలు మూసి ఉండడం, దొంగ బంగారం కలకలం చర్చనీయాంశమైంది.

వ్యాపారిని కాపాడేందుకు వ్యూహం

దొంగ బంగారం కొనుగోలు చేసిన బంగారం దుకాణం యజమానిని కాపాడేందుకు జిల్లా కేంద్రంలోని కొందరు షాపుల యజమానులు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ఒకరి బంధువు ఎస్సై కాగా, అతడితో ఫోన్‌లో మాట్లాడించినట్లు సమచారం. కాగా, సీఐ పరిస్థితి పూర్తిగా సదరు ఎస్సైకి వివరించగా ఆయన కూడా పక్కకు తప్పుకొన్నట్లు తెలిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని 35మంది వ్యాపారులు సిద్దిపేట సీఐని కలిసేందుకు వెళ్లినట్లు సమాచారం. ఈ పంచాయితీ స్థానికంగా ఓ ప్రజాప్రతినిధి వద్దకు చేరినట్లు తెలిసింది. కాగా, పోలీసులు విచారణకు వచ్చి నేటికీ వారం గడిచినా ఈ దొంగ బంగారం కలకలం మిస్టరీగానే మిగిలిపోయింది. విచారణకు రావాలని ఆదేశించినా నేటివరకు సదరు వ్యాపారి వెళ్లకపోవడం గమనార్హం.

హాజీపూర్ మండలంలోనూ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోనూ శుక్రవారం దొంగబంగారం కేసు సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల దొంగ బంగారం క్రయ విక్రయాలు మంచిర్యాలలో జరిగాయంటూ కలకలం రేపడంతో దుకాణాలు వరుసగా మూసి ఉంటున్నాయి. సిద్దిపేటలో నిందితుడు చోరీ చేసిన సొత్తు మంచిర్యాలలో విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడి కావడంతో వారు విచారణ చేపట్టారు. ఈ కేసుతో హాజీపూర్ మండలానికి సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారం క్రితం మండల కేంద్రానికి చెందిన ఓ బంగారం దుకాణం యజమాని దొంగ బంగారం కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. హాజీపూర్‌కు చెందిన ఓ వ్యక్తితోపాటు అతడి స్నేహితులను హాజీపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దాదాపు 15 తులాల వరకు దొంగబంగారం కొన్నట్లు తెలుస్తుండగా.. నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. నిందితుడు కూడా బంగారాన్ని మంచిర్యాలలో విక్రయించినట్లు సమాచారం.

కాలిపై ఇటుకపడి కార్మికురాలికి గాయం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో సర్ఫేస్‌లో పనిచేసే కార్మికురాలి కాలిపై సిమెంట్ ఇటుకపడి గాయమైంది. వెంటనే ఏరియాలోని కేకే–2 డిస్పెన్సరీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మొదటి షిఫ్టులో టబ్బుల్లో డ్ చేస్తుండగా ఇటుక జారి కాలిపై పడడంతో కాలు వాపెక్కిందని కార్మికులు తెలిపారు. మరో కార్మికురాలు ఎండ వేడిమికి తట్టుకోలేక అస్వస్థతకు గురైంది. గాయమైన కార్మికురాలి కాలుకు సిమెంట్ పట్టి వేసి గోదావరిఖని సింగరేణి ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఆస్పత్రిలో యూని యన్ల ప్రతినిధులు కార్మికురాలిని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏరియాలో అధికారులు పర్మనెంట్ మహిళా కార్మికులకు బరువైన పనులు చెబుతూ వేధిస్తున్నారని ఆరోపించారు.

దొనబండలో ఒకరి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన నరేండ్ల రాజ్‌కుమార్ (30) శుక్రవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. హాజీపూర్ పోలీసులు, గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. దొనబండకు చెందిన రాజ్‌కుమార్ ట్రాలీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికిభార్య అంజలి, కుమారుడు అజయ్, కుమార్తె స్వప్న ఉన్నారు. రాజ్‌కుమార్ శుక్రవారం గ్రామశివారులోని ఆలయ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు హాజీపూర్ ఏఎస్సై చాంద్ పాషా ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. కాగా, రాజ్‌కుమార్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కుటుంబీకులు వేధిస్తున్నారని మహిళ ఆత్మహత్యాయత్నం

వాంకిడి: కుటుంబసభ్యులు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన వివాహిత వైరగడె విజయ తనను కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ‘నేను వైరగడె విజయ. మాది తేజాపూర్ గ్రామం. నేను సూసైడ్ చేసుకుంటున్నాను. నాకు నా కుటుంబం నుంచి అందరు 17 ఏళ్ల నుంచి నరకం చూపిస్తున్నారు. చంపాలని కూడా చూస్తున్నారు. అందుకే పోలీస్‌స్టేషన్‌లో కూడా చెప్పుకున్నాను. కానీ.. వాళ్లు కూడా పట్టించుకోవడం లేదు. ఎస్పీ గారికి కూడా 2022లో కంప్‌లైంట్ చేశాను. పోలీస్‌స్టేషన్‌లో చెప్పినా, పంచాయితీ పెద్ద వాళ్లకు చెప్పినా ఉపయోగం లేకుండా పోయింది. అందుకే మీకు చెబుతున్నాను. నా చావుకైనా న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను. ఈ మెసేజ్ కోర్టు జడ్జి గారికి చూపించండి ప్లీజ్.. నేను ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి కారణం నా కుటుంబం, పోలీస్ నిర్లక్ష్యం’ అని వాట్సాప్ మెస్సేజ్ రాసి మీడియా వాళ్లకు పంపించింది. విషయం పోలీసులకు తెలియగా వెంటనే తేజాపూర్ గ్రామానికి వెళ్లి ఆమెను అంబులెన్స్ ద్వారా ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఎస్సై సాగర్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఈ నెల 21న వైరగడె విజయ నుంచి ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్న తరుణంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

పోడు భూముల స్వాధీనానికి అధికారుల యత్నం


పట్టా పాసు పుస్తకాలు చూపిస్తున్న రైతులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అంకుసాపూర్ శివారులో సాగు చేస్తున్న పోడు భూముల స్వాధీనానికి శుక్రవారం అటవీశాఖ అధికారులు యత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ నంబర్ 69లోని పోడు భూములను స్వాధీనం చేసుకునేందుకు డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌రాజు ఆధ్వర్యంలో ఎఫ్‌బీవో బానయ్య, నవ్య, సిబ్బంది చేరుకున్నారు. వివాదాస్పద పోడు భూముల్లో హద్దులు ఏర్పాటు చేసేందుకు వెళ్లగా, పట్టాలు కలిగిన రైతులు అడ్డుకున్నారు. 30 ఏళ్ల నుంచి తాము ఈ భూములను సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టాలున్నాయని తెలిపారు. రైతుబంధు కూడా వస్తుందని, బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నామని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రాణాలైనా వదులుతామని.. భూములను మాత్రం వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. దాదాపు రెండు గంటల పాటు రైతులు, అధికారులు నిరీక్షించి వెనుదిరిగి వెళ్లిపోయారు.

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
CHANGE OF NAME
VEYEEGANDLA HARI KRISHNA S/o. VENKATESHWARLU R/o. H.No. 2-131/1 Rendlaguda (V), Jannaram (M), Manchiryal (D). Have Changed my Name as VEYIGANDLA HARIKRISHNA S/o. VENKATESHWARLU
[Z-1080768]
WANTED
ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217.
[M-1185088]
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462